# జీర్ణించిన హక్కులు

నరసయ్యకు స్వతహా పుట్టిన బుద్ధికాదు. ఆఊళ్లోకి కామేశ్వరరావు గారి కొడుకువచ్చి తిష్టవేశాడు. ఆ సూర్యం సెప్టెంబర్ గ్రాడ్యుయేటు. కాలేజీ పుస్తకాలు వదిలేసి జనరల్ పుస్తకాలు చదవటంవల్లనే. సూర్యం పరీక్షల్లో రెండు మూడుసార్లు తప్పాడని అతని ముఖ్య స్నేహితులు అనుకోవటమే కాకుండా సూర్యం కూడా అనుకుంటూ వుంటాడు. కాని పోయిందేమిటి? కావలసినంత ప్రపంచజ్ఞానం సంపాదించాననే ఆత్మ సంతృప్తి సూర్యానికి లేకపోలేదు. అతను చదివేసిందంతా ఇతరులకు గడగడా చెప్పేసెయ్యాలనే ఆసక్తి మహాపట్టుకు పీడిస్తోంది సూర్యాన్ని. తన తెలివి తేటలు చూసి. ఏ ప్రభుత్వంవారైనా, తనను వుపయోగించుకుంటారేమో అని విశ్వప్రయత్నం చేశాడు. ప్రయివేటు వ్యక్తుల్ని బాగుపరచాలని రాయబారాలు కూడా పంపాడు. ఏంచేస్తే యేం, ఎవరూ కూడా. సూర్యాన్ని గుర్తించనేలేదు. వాళ్ళ వాళ్ళ తెలివి తేటలు చూసి. తనలో తాను నవ్వుకొని. సగౌరవంగా ఇంటికి తిరిగి వచ్చేశాడు. బుద్ధికితగ్గ పని లేకపోయేబప్పటికి ఆలోచనలు ఎక్కువయి పోతున్నాయి. ప్రభుత్వం సేవచేసే అవకాశం కనిపించక పోయేటప్పటికి ప్రజాసేవలోకి దూకాడు సూర్యం. పతిత మానవుల ఉద్ధరణకు పూనుకున్నాడు. ఎవరికి ఏయే కష్ట నష్టాలు వున్నాయో ఆరాతీసి పట్టిక తీసి వుంచాడు. ఆ పట్టికలోంచి ఒక్కొక్కటి సమయానుకూలంగా

తీస్తూ, రామ బాణంలాగ ప్రయోగిస్తూ వచ్చాడు. బ్రతికితే మందు ఫలితం, ఎగిరిపోతే రోగి దురదృష్టం.

సూర్యం. యీ తడవ నరసయ్యను పట్టాడు. హెడ్‌మాస్టర్ రామయ్యగారి అరటితోట ఇవ్వాళ వచ్చి పడిందా? ఎన్నాళ్ళనుంచో ఆ చాకిరీ చేస్తూనే వుండె?

బోరింగ్ పంపు కొట్టి కొట్టి, బిందెలు నింపుతూ వుండె. హెడ్‌మాస్టర్‌గారికి కూతుళ్లే ఎక్కువ. వాళ్ళనుపట్టి అల్లుళ్ళు. ఒకాయన మోటారు దిగితే. రెండోయన రైలు దిగుతుంటే, వీళ్లందర్ని ఆహ్వానించి తీసుకురావాలంటె నరసయ్య వెళ్లక ఇంకెవ్వరు వెళ్లుతారు? హెడ్‌మాస్టర్ చెప్పాడంటే వేగమే దానికి తిరుగులేదు. అబ్బబ్బ! తన పిల్లలే కనకి అట్లా అల్లరి చేస్తూవుంటేనా, నలిచి పోగులు పెట్టక పోయాడు నరసయ్య, కాని హెడ్‌మాస్టర్ పిల్లలు. అ పిల్లలు నరసయ్య భుజం ఎక్కాలసిందే. చీదరించుకుంటే తప్పేదా? ఇవన్నీ చూశాడు సూర్యం. హృదయం దహించుకు పోయింది. కడుపు తరుక్కు పోయింది. హక్కులు తెలియని అమాయకుడు నరసయ్య. నరసయ్య బుర్రలోకి ఇంజక్షన్ చేసి వదిలి పెట్టాడు. నరసయ్య అట్టే ఆలోచించటం మొదలు పెట్టాడు. అవును నేను స్కూల్‌కు బంట్రోతుకాని, హెడ్‌మాస్టర్ ఇంటికి నాకు సంబంధమేమిటి? నరసయ్య పదే పదే ఆలోచించటం మొదలు పెట్టాడు. నలుగుర్ని ఓచోట పోగుచేశాడు. సూర్యం దంచేశాడు వుపన్యాసాన్ని, నరసయ్య నాయకుడయి పోతున్నాడు. మనం, మన పనులేమిటో చూసుకోవాలిగాని, అడ్డమైన చాకిరీ చెయ్యటానికి మనమేమీ బానిసలం కాదు. మనమూ మనుష్యులమే. మనకూ ఆత్మవుంది. మనకూ అభిమానం వుంది. మనకూ వుంది! ఏమిటి? ఏమిటో అయోమయం. ఏమీ అర్థంకాలేదు. అన్నీ

వుంటే మనకు లేందేమిటి? నరసయ్య గట్టిగా ఆలోచించాడు. ఓ నిశ్చయానికే వచ్చేశాడు. నరసయ్య ఇక హెడ్‌మాస్టర్ ఇంటి చాకిరీ చెయ్యడు. తన డ్యూటీ ఏమిటో చేసుకుపోతాడు. ఏడింటికి వచ్చి, గంట కొట్టేస్తాడు. పిల్లలందరూ లోపలికిపోగానే అటెండెన్సు రిజిస్టర్ అందిస్తాడు. చాక్‌పీస్, డస్టర్ లోపల పెట్టేస్తాడు. ఆ తర్వాత రెండింటికిపోయి తిరిగి వస్తాడు. అయిదవంగానే గంటకొట్టేసి, రిక్షా మీద ఇంటికి వెళ్ళిపోతాడు. నరసయ్య సంతోషం పట్టలేకపోతున్నాడు. అంతకంటె, సూర్యం పొంగిపోతున్నాడు. ఈనాటికి ఓ పతిత మానవుణ్ణి ఉద్ధరించానని.

నరసయ్య గుండె గుభేలుమన్నది ఆనాడుకూడా. హెడ్‌మాస్టర్‌ను చూసి, ఆ తలపాగ, ఆ లాల్చి, ఆ దోవతి, చేతిలో పేంబెత్తం. కళ్లజోడు అద్దాల్లోంచి చూస్తున్న ఆ ఎర్రికళ్లు, నరసయ్య నిలువునా కూలబడిపోయే స్థితిలో వున్నాడు. అయ్యా అంటూ మామూలుగానే చేతులు నలుపుతుంటూ, తరతరాల బానిసత్వ చిహ్నాన్ని ప్రదర్శించాడు. కాని వీపుమీద తన హక్కొకటి గట్టిగా చరిచింది.

దబుక్కున ఉలిక్కిపడ్డాడు నరసయ్య. నిట్టనిలువునా నిలబడ్డాడు. హెడ్‌మాస్టర్ ఎగాదిగా చూశాడు ఒకటి రెండుసార్లు. నరసయ్య జంకలేదు. హెడ్‌మాస్టర్‌కు ఆశ్చర్యం వేసింది. ఓ నిమిషంసేపు ఆలోచించాడు. ఏమీ అంతుపట్టటంలేదు. మళ్ళీ మామూలు దోరణిలోనే, నరసయ్యా అరటికాయలు ఇంట్లో ఇచ్చావా అన్నాడు హెడ్‌మాస్టర్. నేను స్కూల్‌లో ప్యూన్‌గాని, మీ ఇంటికికాదు అన్నాడు ఖచ్చితంగా నదురూ బెదురూ లేకుండా. హెడ్‌మాస్టర్ మతి పోయింది ఒక్కసారిగా. ఏం సమాధానం చెప్పాలో తోచలా. అటూ ఇటూ గాబరాగా చూశాడు. పైకిఎంత దైర్యంగావున్నా, నరసయ్య గుండె

గుభేలు మంటూనే వుంది. హెడ్‌మాస్టర్, ఏ మాట అంటే, తను ఏ మాట అనాలో గట్టిగా ఆలోచించుకుంటున్నాడు నరసయ్య. ఆయన నోట్లోంచి ఏ మాట వస్తుందా అని అదుర్దాగా చూస్తున్నాడు నరసయ్య.

హెడ్‌మాస్టర్ ఎగాదిగా ఒకటి రెండుసార్లు చూసి, చర చర లోపలికి వెళ్ళిపోయాడు. నరసయ్య అమ్మయ్య అనుకున్నాడు. ఇంక అయ్యగారి నోరు కట్టుబడింది. గెలుపు మనదేనని నరసయ్య హుందాగా తిరుగుతున్నాడు. లోపల్నుంచి గభాలున నరసయ్యకు పిలుపు వచ్చింది. 'ఏం నరసయ్యా, నికు ఎన్ని తడవలు చెప్పాను ఈ సిరాబుడ్డి కడిగి కొత్త సిరా పొయ్యమని, ఇక్కడ కలం ఏది? మాట్లాడవే. ఈ బ్లాక్ బోర్డు తీసేసి లోపలపెట్టేసి, లోపల వున్న బోర్డుతీసి ఇక్కడ పెట్టెయ్యి. తెలుస్తోందా చెపుతోంది.' హెడ్‌మాస్టరు అథారిటీగానే అంటున్నాడు. నరసయ్యకు ఆనాడల్లా ప్రాణం విసిగిపోయింది.

ఒక వారం రోజులకల్లా నరసయ్య శరీరం హూనం. హూనం అయిపోయింది. మామూలుగా తనకు వచ్చే కూరలు నారలు రావటం లేదు. హెడ్‌మాస్టర్ గారింట్లో విస్తరి వేసుకున్న పాపాన పోలేదు ఆ కుటుంబంలో.

అందరూకూడా నరసయ్య అంటే ఏవగింపుగా చూడటం మొదలు పెట్టారు. తనలో బయలుదేరిన కాఠిన్యమే ఇతరులలోకూడా చూస్తున్నాడు నరసయ్య. ప్రేమ, ఆప్యాయత స్థానంలో, ప్రతీకారం ఏవగింపు వచ్చి కూర్చున్నాయి. అయ్యో! హెడ్‌మాస్టర్‌గారు ధర్మప్రభువు. ఆయనగార్ని ఎదిరించి ఈ వూళ్లో వుండగలమా మరి మనం. ఇట్లా పోట్లాట ఎందుకు పెట్టుకున్నావయ్యా అని భార్య ఒకటే పోరు. నరసయ్యకు వూపిరి సలపటంలేదు. ఆర్థికంగా గాని, ఇంకా ఇతర

త్రాగాని నరసయ్య ఒళ్లో ఒరిగిపడింది ఏమీ లేకపోయినా, మానసిక సంక్షోభం మాత్రం రోజు రోజుకు పెరిగిపోతోంది.

ఆనాడు ఆదివారం. సూర్యం పడకకుర్చీలో పడుకుని ఆట్టే ఆలోచిస్తున్నాడు. అప్పుడప్పుడుమాత్రం కాఫీ గుటకలు వేస్తున్నాడు. ఈనాటికి నరసయ్యను ఉద్ధరించగలిగాను. కరుడుగట్టిన బానిసత్వ శృంఖలాన్ని ఛేదించగలిగాను. ఇక మన పని ఈ వూరు చివర ఒక ఫ్యాక్టరీ వుంది. అక్కడకు పోవాలి. వాళ్ళకు జీతాలు ఏమిస్తున్నారో. ఎన్ని గంటలు పని చేయించు కుంటున్నారో. వాళ్ళ దురవస్థ ఏమిటో కనుక్కోవాలి. దబుక్కున కుర్చీలోంచి లేచాడు. ఎదురుగా చేతులు నలుపుకుంటూ నరసయ్య కనిపించాడు.

ఏం నరసయ్యా అంటూ పకపకా నవ్వాడు సూర్యం. నా బ్రతుకు నవ్వులపాలుగానే వుంది బాబు. నా హక్కు అడిగినప్పటి నుంచి డ్యూటీ ఎక్కువయింది బాబు. ఊపిరి సలపటంలేదు. చచ్చిపో తున్నానంటే నమ్మండి. ఎక్కడ పొలిమేర, ఎక్కడ మన వూరు. అక్కడకు ఇన్‌స్పెక్టర్‌గారు వచ్చారుట. నన్ను తీసుకు రమ్మని పంపారండి. నడుములు విరిగిపోయినాయి. ఆమ్మొ అమ్మొ ఆ చాకిరీ నేను చెయ్యలేను బాబు. అందులో ఇన్‌స్పెక్టర్. ఆయనతో ఏమన్నా అన్నామంటే ఇంకేమన్నా వుందా, నరసయ్య ఆవేదనగా చూస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్! పెద్ద మొనగాడు గామాలు! కలెక్టరవుతే మాత్రం ఏం? ఒక లెక్కా! వాడు ఎలాంటివాడో, వాడి అంతు కనుక్కుని మరీ వదిలి పెట్టనా?" సూర్యం వుగ్రుడయి పోయాడు.

"బాబు బాబు నా పొట్టమీద కొట్టకండి" అంటూ ప్రాధేయపడ్డాడు నరసయ్య.

"నేను గ్రహించాను: నేను గ్రహించాను. నీ బలహీనత ఏమిటో నేను పూర్తిగా గ్రహించాను. నువ్వు బీదవాడివి. నిన్ను పట్టుకు పీడిస్తున్నదేమిటో తెలుసా? దారిద్ర్యం....ఇప్పుడు తెలిసింది. నీ దారిద్ర్యాన్ని వాళ్ళు తమ స్వప్రయోజనాలకోసం అదొక బలహీనతగా వుపయోగించుకుంటున్నారు. సరిగ్గా అదే.... నేను కనిపెట్టేశాను. దేశంలో దారిద్ర్యం పోతేనేగాని, మోక్షం లేదు. దారిద్ర్యం వున్నంతవరకు వీళ్ళు ఇట్లా మనల్నందర్నీ పీడించుకు తింటూనే వుంటారు—తెలిసిందా నరసయ్యా" సూర్యం కళ్ళు ఎర్రచేసి చూస్తున్నాడు.

'అయ్యగారు అంతకంటె కోరుకు నేదేముంది చెప్పండి. మాకు పొట్టకు గడవకే కాదండీ ఈ పనులు చేస్తుంటా:....' నరసయ్య జంకుతూనే అన్నాడు.

'అదేనోయ్ నేను చెప్పేది' సూర్యం కసురుకున్నాడు. నరసయ్య వెనకనుంచి మెల్లిగా వెళ్ళిపోయాడు.

భళ్లున తెల్లవారింది. గడియారం పది కొట్టింది. నరసయ్య బడిగంట కొట్టాడు. హెడ్‌మాస్టర్ దగ్గర్నుంచి వెంటనే లోపలికి రమ్మని నరసయ్యకు కబురొచ్చింది. వణుక్కుంటూ నరసయ్య లోపలికి వెళ్ళి, 'అయ్యగారూ అరటికాయలు ఇంట్లో ఇచ్చి వచ్చానండి' అన్నాడు.

( ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, — )